క్లుప్తంగా

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

దోమ: గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో అధికారులు అలసత్వం వహించ రాదని ఎంపీడీఓ గ్యామా సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, శానిటేషన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి అయిందన్నారు. రాజీవ్ యువ వికాసంలో జాబితా ప్రకారం అర్హులను ఎంపిక చేయాలన్నారు.

చివరి గింజ వరకూ కొంటాం

ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఆంజనేయులు ముదిరాజ్

కుల్కచర్ల: రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయని కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ చెప్పారు. గురువారం మండలంలోని ముజాహిద్‌పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ ఉద్దేశంతో కొందరు ప్రతిపక్ష నేతలు కొనుగోలు కేంద్రాలు తీసేశారు అనే ప్రచారం చేస్తున్నారన్నారు. రైతులు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. చివరి గింజ వరకు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమలింగం, భీమయ్య, బాలక్రిష్ణయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



ధారూరు: కేరెళ్లిలో సాధన సంస్థ మండల కోఆర్డినేటర్ అంజయ్య

కొడంగల్ రూరల్: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని న్యాయవాదులు బస్వరాజ్, ఆనంద్, వెంకటయ్య, రమేష్, మహేష్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని కోర్టు ఆవరణలో ప్రపంచ బాల కార్మిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. 14ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమని, ఒకవేళ పనిలో పెట్టుకుంటే యజమానితోపాటు పిల్లల తల్లిదండ్రులు సైతం శిక్షకు గురికాకతప్పదని అన్నారు.

బడీడు పిల్లల్ని బడిలో ఉంచాలి

ధారూరు: బడీడు పిల్లల్ని పనిలో కాకుండా బడిలో ఉంచాలని సాధన స్వచ్ఛంద సంస్థ ధారూరు మండల కోఆర్డీనేటర్ అంజయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని కేరెళ్లిలో గురువారం అంతర్జాతీయ బాలకార్మిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఉత్సాహంగా రివర్స్ డ్రైవింగ్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ

యాలాల: ఏరువాక సందర్భంగా వ్యవసాయ రంగానికి సంబంధించిన యంత్రాలతో రైతుల మధ్య పోటీ నిర్వహించడం అభినందనీయమని యాలాల ఎస్‌ఐ గిరి అన్నారు. గురువారం మండలంలోని చెన్నారంలో సోలిపురం క్రిష్టారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, యువరైతు పవన్‌కుమార్‌రెడ్డి ట్రాక్టర్ రివర్స్ డ్రైవింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎస్‌ఐతో పాటు ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మాజీ సభ్యుడు శివకుమార్, కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ తదితరులు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. తక్కువ సమయంలో నిర్దేశిత ప్రదేశానికి ట్రాక్టర్లను రివర్స్‌లో నడిపించడం ఎంతో నైపుణ్యం కావాలన్నారు. ఇటువంటి పోటీలతో గ్రామాల్లో స్నేహపూరిత, పండుగ వాతవరణం నెలకొంటుందన్నారు. ఈ పోటీల్లో మొదటిస్థానం లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన రమేష్, రెండో స్థానం ముకుందాపూర్‌కు చెందిన పకీరప్ప, మూడో స్థానంలో తిమ్మాయిపల్లికి చెందిన కిష్టప్ప నిలిచారు. వీరందరికి నగదు ప్రొత్సాహకంతో పాటు సన్మానించారు. కార్యక్రమంలో మల్లప్ప, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బడి గంట.. సమస్యలేనంట!

బేస్‌మెంట్‌కే పరిమితం



పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు, పక్కన అసంపూర్తి భవనం

కొడంగల్: పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం బేస్‌మెంట్‌కే పరిమితమైంది. పనులు ప్రారంభించి 7 నెలలు గడుస్తున్నా ముందుకు కదలడం లేదు. పాఠశాలలో 74మంది విద్యార్థులు చదువుకుంటుండగా ఒక గదిలో 1, 2, 3వ తరగతులు, వరండాలో 4, 5వ తరగతులు నిర్వహిస్తున్నారు. బుధవారం కురిసిన వర్షంతో పాఠశాల ఆవరణలో నీరు నిలిచింది.

ప్లాస్టింగ్ మరిచారు



ఇటుకల గోడ

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని పులుమద్ది జెడ్పీహెచ్ఎస్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల కింద నిధులు మంజూరు కాగా మరమ్మతులు చేయించారు. పాఠశాల వెనుకభాగంలో గోడలకు ప్లాస్టింగ్ చేయడం మాత్రం మరిచారు. దీంతో ఇటుక గోడలే దర్శనం ఇస్తున్నాయి.

ప్రహరీ లేదు



ప్రహరీ లేని మాణిక్‌నగర్ ప్రభుత్వ పాఠశాల

తాండూరు టౌన్: పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తొలిరోజు విద్యార్థుల హాజరు శాతం అరకొరగానే కనపడింది. మాణిక్‌నగర్ పాఠశాలకు సరైన ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక శక్తులకు నిలయంగా మారింది. పాత తాండూరులోని ప్రభుత్వ నంబర్ 2 ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు ఏళ్ల తరబడిగా సొంత భవనం లేకపోవడం విడ్డూరం. ప్రస్తుతం ఈ పాఠశాల ఎస్సీ బాలికల హాస్టల్‌లో కొనసాగడం గర్హనీయం.

శిథిలావస్థకు చేరిన పాఠశాల



తరగతి గది వరండాలో కొనసాగుతున్న విద్యాభ్యాసం

కొడంగల్ రూరల్: శిథిలావస్థకు చేరిన తరగతి గదులతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. మున్సిపల్ పరిధిలోని గుండ్లకుంట ప్రాథమిక పాఠశాలలో మూడు తరగతి గదులుండగా కేవలం ఒక్క గదిలో 20 మంది విద్యార్థులకు విద్యా బోధన జరుగుతుంది. మరో రెండు గదులు శిథిలావస్థకు చేరాయి. హుస్సేన్‌పూర్ ప్రాథమిక పాఠశాల సైతం శిథిలావస్థకు చేరింది.

వేధిస్తున్న సమస్యలు



ఎన్కేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మరుగుదొడ్ల దుస్థితి

బొంరాస్‌పేట: మండల పరిధిలోని ఎన్కేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల సమస్యల వలయంలో చిక్కుకుంది. అసంపూర్తి నిర్మాణంలో అదనపు గదుల భవనం, ప్రహరీ, మరుగుదొడ్లు, తాగునీటి ట్యాంకు లేకపోవడం వంటి సమస్యలు విద్యార్థులను వేధిస్తున్నాయి. రేగడిమైలారంలో ఒకే ఆవరణలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు డిప్యూటేషన్‌పై పంపారు. మంజూరైన ఉన్నత పాఠశాల భవనం నేటికి నిర్మాణం కాలేదు. పాడుబడ్డ గదిలో వండుతున్నారు.



బషీరాబాద్: ఇందిరానగర్ స్కూల్‌లో పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

సుదీర్ఘ విరామం అనంతరం బడి గంట గణగణ మోగింది. గురువారం ఉదయం పాఠశాలలు తెరుచుకున్నాయి. ఎన్నో ఆశలతో బడిలో అడుగుపెట్టిన విద్యార్థులకు అక్కడ అసౌకర్యాలు స్వాగతం పలికాయి. కొన్నిచోట్ల అన్ని వసతులు ఉన్నా మరికొన్నింటిలో సమస్యలు వేధిస్తున్నాయి. మరోపక్క మొదటిరోజే ఏకరూప దుస్తులు, పాఠ్య, నోట్ పుస్తకాలు అందివ్వాలన్న సూచనను ఉపాధ్యాయులు పాటించారు. పలు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి సూచనలు ఇచ్చారు.

– సాక్షి, నెట్‌వర్క్

సాక్షి పరిశీలన




దుద్యాల్: విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆవరణలో పేరుకుపోయిన గడ్డి



చెంగోల్ బడిలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

తాండూరు రూరల్: మండలంలోని చింతమణిపట్నం ప్రాథమిక పాఠశాల గేటు ముందు వర్షపు నీరు నిలిచింది. దీంతో లోపలికి వెళ్లడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కిచెన్‌షెడ్ మరమ్మతులకు గురైంది. ఓగిపూర్, చంద్రవంచ, చిట్టిఘనాపూర్ గ్రామ పాఠశాలలకు ఇంకా యూనిఫాంలు అందలేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. చెంగోల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు పేరుకుపోయాయి. విద్యార్థులు ఆడుకునేటప్పుడు విషసర్పాలు ఉంటాయని తల్లిదండ్రులు భయందోళన వ్యక్తం చేస్తున్నారు.



చింతమణిపట్నం పాఠశాలలో కిచెన్‌షెడ్ దుస్థితి



పరిగి: మిట్టకోడూర్‌లో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ తదితరులు



దౌల్తాబాద్ సీపీఎస్ పాఠశాలలో ప్రార్థన చేయిస్తున్న ఉపాధ్యాయులు



మోమిన్‌పేట: ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి



ధారూరు: ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు



దోమ: ప్రాథమిక పాఠశాలలో తొలిరోజు ఏఐ తరగతులు వింటున్న విద్యార్థులు



అనంతగిరి: మదన్‌పల్లిలో విద్యార్థులపై పూలు చల్లి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

సమస్యల పరిష్కారానికే భూభారతి

అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్

మోమిన్‌పేట: భూ సమస్యల పరిష్కారానికే భూభారతి సదస్సులు నిర్వహిస్తున్నట్లు అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. గురువారం మండలంలోని కేసారం గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు భూ సమస్యలను సదస్సుల దృష్టికి తెస్తే అధికారులు పరిష్కరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ సురేష్ కుమార్, ఆర్ఐలు గోవర్ధన్, సరిత, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న లింగ్యా నాయక్

అంగన్‌వాడీల్లో ‘పోషణ వాటిక’

బషీరాబాద్: అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా అంగన్ వాడీ కేంద్రాలలో ఈ నెల 11 నుంచి 17 వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గురువారం బషీరాబాద్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ‘పోషణ వాటిక’ నిర్వహించారు. ఇందులో రకరకాల కూరగాయల విత్తనాలు నాటారు. వారి ద్వారా పండే కూరగాయలతో విద్యార్థులకు వంట చేస్తామని అంగన్‌వాడీ సూపర్ వైజర్ జ్యోతి అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వాణిశ్రీ, శోభరాణి, శాంతభాయి. మొగులమ్మ, వినోద, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి

బంట్వారం: రెండున్నర ఏళ్లు దాటిన చిన్నారులను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి సూచించారు. గురువారం కోట్‌పల్లి మండలంలోని లింగంపల్లి గ్రామంలో అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై చిన్నారులకు గులాబీ పూలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మౌనిక, పంచాయతీ కార్యదర్శి హేమలత తదితరులు పాల్గొన్నారు.



బషీరాబాద్: విత్తనాలు నాటుతున్న అంగన్‌వాడీ టీచర్లు

క్రీడలతో మానసిక ప్రశాంతత

పూడూరు: క్రీడలతోనే స్నేహపూరిత వాతావరణం నెలకొంటుందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మన్నెగూడలో వారం రోజులుగా రహీస్‌ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతోనే మానసిక ప్రశాంతతతో పాటు స్నేహసంబంధాలు బలపడతాయని అన్నారు. గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లేశం, వైస్ ఎంపీపీ మల్లేశ్, మాజీ సర్పంచ్‌లు బుచ్చన్న, సాయన్న, నాయకులు రహీస్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, వెంకటయ్య, జాహెద్, దయానంద్‌గౌడ్, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



విజేత జట్టుతో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

ప్రతిభ చాటిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థినితోపాటు తండ్రిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది



యాలాల: విద్యార్థులను సన్మానిస్తున్న రిటైర్డ్ జీహెచ్‌ఎం

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో టాపర్‌గా నిలిచిన విద్యార్థిని సన్మానించారు. కళాశాలలో చదువుకున్న కె.అశ్విని(చంద్రకల్)ని ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డితోపాటు అధ్యాపక సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు. కళాశాలలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన, ప్రతీ సబ్జెక్టుకు నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నారన్నారు. ఉచిత పాఠ్య పుస్తకాలతోపాటు అర్హత కలిగిన విద్యార్థులకు స్కాలర్‌షిప్, బస్ పాస్ సౌకర్యంతో ప్రభుత్వం వసతులు కల్పిస్తోందని అన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పూడూరు: నిరంతర శ్రామికుడు ఒక ఉపాధ్యాయుడేనని మాజీ పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నాయకులతో కలిసి ఉపాధ్యాయులను ఆయన సన్మానించారు. నగదు ప్రోత్సాహకం అందజేత

యాలాల: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని రిటైర్డ్ జీహెచ్‌ఎం మాధురిదేవి అన్నారు. గురువారం మండలంలోని దేవనూరు ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ఆమె మాట్లాడుతూ.. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన మహేశ్వరి, అనూష, వైష్ణవిలకు నగదును అందించారు. అనంతరం వారి తల్లిదండ్రులను సైతం సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేశ్, గ్రామస్తులు క్రిష్ణ, రాజేందర్, రఫీక్, నర్సింహులు తదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే టీఆర్ఆర్ పర్యటన

పూడూరు: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ ఇచ్చేందుకు శుక్రవారం పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి రానున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని రైతు వేదికలో కార్యక్రమం ఉంటుందని చెప్పారు. మండల పరిధిలోని నాయకులు, లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

బషీరాబాద్‌కు మనోహర్‌రెడ్డి

బషీరాబాద్: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బషీరాబాద్‌కు శుక్రవారం రానున్నారని ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఇందిరమ్మ లబ్ధిదారులకు కొర్విచెడ్ సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో ఇళ్ల ప్రొసీడింగ్స్ ఇస్తారని చెప్పారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

ఇందిరమ్మ ప్రొసీడింగ్‌ల అందజేత



దౌల్తాబాద్: లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేస్తున్న నాయకులు



కుల్కచర్ల: లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

కుల్కచర్ల: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో 7 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తుందన్నారు. చౌడాపూర్ మండలం మందిపల్‌లో పంచాయతీరాజ్ ఈఈ ఉమేష్, ఎంపీడీఓ సోమలింగం ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు.

అర్హులందరికీ ఇళ్లు

దౌల్తాబాద్: మండలంలోని గుముడాల గ్రామంలో ఐదుగురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లను మాజీ సర్పంచ్ నర్సప్ప గురువారం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు మేలు జరుగుతుందన్నారు.

అల్లిఖాన్‌పల్లిలో...

దుద్యాల్: మండల పరిధిలోని అల్లిఖాన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రొసీడింగ్‌లను కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఇళ్లు అందించడంలో కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉంటుందని అన్నారు.